క్లుప్తంగా

విశ్వకర్మ యోజన అద్భుతం



మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్న బీజేపీ శ్రేణులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని నరేంద్రమోదీ విశ్వకర్మ యోజనకు రూ.13 వేల కోట్లు కేటాయించడం అద్భుతమైన విషయమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్ హర్షం ప్రకటించారు. శుక్రవారం నగరంలో జిల్లా బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా నాయకులు థ్యాంక్యూ మోదీ కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయిరామ్ మాట్లాడుతూ దేశ సాంస్కృతిక జీవన విధానంలో విశ్వకర్మలది ప్రధాన భూమిక అనే విషయాన్ని గుర్తించే నాయకత్వం బీజేపీలో ఉందన్నారు. ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి కురగంటి సతీష్ మాట్లాడుతూ మొదట విడతలో 18 సంప్రదాయ వృత్తులకు విశ్వకర్మ యోజనను వర్తింపజేస్తారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, అసెంబ్లీ కన్వీనర్ యెనుముల రంగబాబు, అడ్డూరి చక్రవర్తి, డాక్టర్ నక్కా దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

టైం స్కేల్ ఉద్యోగుల సర్వీసులు క్రమబద్ధీకరించాలి



డీఆర్‌వో నరసింహులుకు వినతిపత్రం అందజేస్తున్న టైంస్కేలు ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: మూడు దశాబ్దాలు పైబడి వివిధ శాఖలలో పనిచేస్తున్న టైం స్కేల్ ఉద్యోగుల సర్వీసులు క్రమబద్ధీకరించాలని శుక్రవారం డీఆర్‌వో జి.నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర టైం స్కేల్ ఉద్యోగుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బి.సురేష్, కె.శ్రీనివాస్ ల పిలుపు మేరకు శుక్రవారం తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయం చేరుకుని ఆయనకు వినతిపత్రం అందించి సమస్యలను విన్నవించారు. 1993 నంబరు 25 కి ముందు ఎన్ఎంఆర్, డైలీ వేజ్, ఫుల్ టైం, పార్ట్ టైం తదితర ఉద్యోగాల్లో చేరినవారి సర్వీసులను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా సంఘ ప్రతినిధులు జి.వరప్రసాద్, కె. శ్రీనివాస్, ఆర్.లక్ష్మణరావు, కె.రామచంద్రరావు, ప్రభుదాస్ ఉన్నారు.

రెప్కో బ్యాంక్‌లో నూతన డిపాజిట్ పథకం ప్రారంభం



నూతన డిపాజిట్ పథకాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి అజయ్‌కుమార్ మిశ్రా

ప్రకాశం నగర్ : బాలికల కోసం రెప్కో బ్యాంక్‌లో రెప్కో తంగామగాల్ అనే నూతన డిపాజిట్ పథకాన్ని గురువారం చెన్నైలో కేంద్రమంత్రి అజయ్‌కుమార్ మిశ్రా చేతుల మీదుగా ప్రారంభించినట్లు బ్యాంక్ చీఫ్ మేనేజర్ సీహెచ్ పవన్‌చంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కేవలం 18 సంవత్సరాల లోపు బాలికల కోసం రూపొందించామన్నారు. కనీసం 3 సంవత్సరాల నుంచి గరిష్టంగా 5 సంవత్సరాల వరకు 8.50 శాతం వడ్డీతో డిపాజిట్ చేసుకోవచ్చునని తెలిపారు. బాలిక తల్లిదండ్రులు పిల్లల వయస్సు ధ్రువీకరణ పత్రాలతో నగరంలోని బ్యాంక్ టి.నగర్ బ్రాంచిలో సంప్రదించాలని కోరారు.

సినిమాలు



శ్యామల	జైలర్
సూర్యమినీ	గదర్-2
సూర్యప్యాలెస్	బ్లూ బీటెల్
స్వామి	భోళాశంకర్
శివజ్యోతి	ఓఎంజీ-2
అనుశ్రీ	భూతాలబంగ్లా
రాజా	జైలర్
అశోక	జైలర్
ఊర్వశి	పిజ్జా-3
రంభ	బేబీ
మేనక	రఘువరన్ బీటెక్, మిస్టర్ ప్రెగ్నెంట్
అప్సర	బ్లూ బీటెల్
నామవరం	
వీఎస్ మహల్	జైలర్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	రఘువరన్ బీటెక్, బ్లూ బీటెల్
కడియం	
వెంకటసూర్య	జైలర్

ఆటకు బాసట.. ప్రతిభకు పట్టం

- క్రీడల్లో విశేషంగా రాణించిన వారికి వైఎస్సార్ అవార్డులు
- రేపు సాయంత్రం వరకు దరఖాస్తుల స్వీకరణ

ప్రకాశం నగర్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నేతృత్వంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇచ్చే వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. జిల్లాలోని వివిధ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రభుత్వం వైఎస్సార్ అవార్డులను అందజేయనుంది. క్రీడలతోపాటు ప్రభుత్వం వ్యవసాయం, విద్య, వైద్యం , ఆర్ట్ అండ్ కల్చరల్, మీడియా, ఇండస్ట్రీస్ వంటి విభాగాల్లో ఈ అవార్డులు అందజేస్తుంది. క్రీడల్లో క్రికెట్, వాలీబాల్, ఫుట్ బాల్, హాకీతో పాటు సంప్రదాయ క్రీడలైన కబ్బడీ, ఖోఖోలో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ పురస్కారాలకు అర్హులు. క్రీడాకారులు ఆయా క్రీడాల్లో సాధించిన ప్రతిభకు సంబంధించిన పత్రాలు, చిరునామా, ఫోన్ నంబర్, ఈ మెయిల్ వంటి వివరాలను జత చేస్తూ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ సాయంత్రంలోపు స్పోర్ట్స్ ఇన్ ఏపీ ఎట్‌ది రేట్ ఆఫ్ జీమెయిల్ డాట్ కాంకు పంపించవలసి ఉంటుంది. బొమ్మూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులను నేరుగా కూడా అందించవచ్చు.



వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ పురస్కారం

పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన

వైఎస్సార్ అవార్డ్స్ ఎంపిక కోసం క్రీడా విభాగంలో వచ్చిన దరఖాస్తులను రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో పారదర్శకంగా పరిశీలన చేసి విశేష ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేస్తారు.

క్రీడా అభ్యున్నతికి తోడ్పాటు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో క్రీడలకు పెద్ద పీట వేసి, క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు జరిగినప్పుడు క్రీడాకారులకు భోజన సదుపాయం దాతల సహకారంతో కల్పించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో క్రీడాకారులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ తో పాటు గుడ్డు, పాలు వంటి పోష్టికాహారం ప్రభుత్వమే ఏర్పాటు చేయడంతో క్రీడాకారులు, కోచ్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీటితోపాటు జగనన్న క్రీడా సంబరాలు పేరుతో స్కూల్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించి నగదు పురస్కారాలతో పాటు, సర్టిఫికెట్లను అందజేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వైఎస్సార్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుల కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. క్రీడాకారులు వారి దరఖాస్తును ఈ నెల 20 సాయంత్రం లోపు ఈ మెయిల్ ద్వారా ఒక పేజీకి మించకుండా పంపించాలి.

– డీఎంఎం శేషగిరి, జిల్లా ముఖ్య క్రీడా శిక్షకుడు

వృద్ధులకు షోషకాహారం అందించండి

- సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి ఆదేశాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గౌతమీ జీవకారుణ్య సంఘంలో వృద్ధులకు సరైన షోషకాహారం అందడంలేదని, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి అధికారులను అదేశించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గౌతమీ జీవకారుణ్య సంఘంలో శుక్రవారం తనిఖీలు చేశారు. అక్కడ వసతులు పరిశీలించి వృద్ధుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



గౌతమీ జీవకారుణ్య సంఘంలో వృద్ధుడితో మాట్లాడుతున్న జడ్జి ప్రత్యూషకుమారి

కార్మిక చట్టాలపై అవగాహన

లేబర్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో ది రాజమండ్రి పట్టణ మోటార్ మెకానిక్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ బిల్డింగ్‌లో దుకాణాలలో పనిచేస్తున్న కార్మికుల చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రత్యూషకుమారి మాట్లాడుతూ కార్మిక హక్కులు, వివిధ కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్మికులు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పని చేయాలన్నారు. రాజ్యాంగంలో పొందుపరచిన ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం 6 నుంచి 14 ఏళ్ల వయసు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకోరాదన్నారు. కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవడం ద్వారా పింఛను, ప్రమాద బీమా తదితర ప్రయోజనాలు పొందవచ్చన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ విధులు, ఉచిత న్యాయ సేవలపై పలు విషయాలను తెలిపారు. ఎలాంటి న్యాయ సమస్యలు ఉన్నా, అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలు అందకపోయినా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. లేబర్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది ఎ.విజయప్రకాష్, ఎం.లలితకుమారి పాల్గొన్నారు.

జీతాలు చెల్లించండి

కంబాలచెరువు: స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఫ్యాప్టో ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల సమావేశం జరిగింది. దీనికి హాజరైన ఫ్యాప్టో చైర్మన్ పి.జయకర్ మాట్లాడుతూ బదిలీ, ప్రమోషన్లు అయిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని, ప్రస్తుతం అమలు చేస్తున్న పని సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేయాలన్నారు. జీవో 117ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెక్రటరీ జనరల్ శేష బ్రహ్మం, కోశాధికారి జేడీ ఇసాక్ డేనియల్‌బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ధవళేశ్వరం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ శుక్రవారం ప్రకటించారు. దీని ప్రభావం ధవళేశ్వరం క్వారీ రోడ్డు, ఎంప్లాయిస్‌కాలనీ, అగ్రహారం, ఎర్రకొండ, సాయిప్రియాంక, ఇత్తడి ఫ్యాక్టరీ, కాటన్ పేట, వీఐపీ ఘాట్, బీఎస్ఆర్ కాలనీలలో ఉంటుందన్నారు.

వేగంగా మెడికల్ కళాశాల పనులు

- ఏపీ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు సూచన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెడికల్ కళాశాల పనులు త్వరగా పూర్తిచేయాలని, మరికొద్ది రోజుల్లో వైద్య తరగతులు ప్రారంభం కానున్నా పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందంటూ ఏపీ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి టి.కృష్ణబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను కృష్ణబాబు శుక్రవారం పరిశీలించారు. మెడికల్ కళాశాలకు అనుసంధానంగా నిర్మిస్తున్న వైద్య విద్యార్థుల హాస్టల్స్‌ను పరిశీలించారు. వాటిలో పనులు ఇంకా కొన్ని పూర్తి కాకపోవడంతో వెంటనే వాటిని పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. వైద్య విద్యార్థినుల హాస్టల్స్ చుట్టూ ప్రహరీ నిర్మించాలని, వైద్య విద్యార్థుల హాస్టల్‌కి గ్రిల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. బాత్‌రూమ్‌లు బాగా లేవని, వాటిని సరి చేయమని, వాషింగ్ మెషీన్ల విభాగం బాగుండాలని సూచించారు. వైద్య విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. రోడ్లు సరిగా లేవని వారు కృష్ణబాబుకు తెలిపారు. వాటిని పూర్తి చేసేందుకు అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆయన వెంట మెడికల్ కళాశాల హెచ్‌వోడీ పీవీవీ.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి, ఆర్ఎంవో డాక్టర్ మనోజ్, ఇతర వైద్యాధికారులు ఉన్నారు.



మెడికల్ కళాశాల వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఏపీ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు

ఆక్రమణలు తొలగించండి

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన రహదారులలో ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సజావుగా ఉండేలా చూడాలని కమిషనర్ కె.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో నగరంలోని ఆనాల వెంకట అప్పారావు రోడ్డు, జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డు, దానవాయిపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని ప్రధాన రహదారులలో రోడ్డును ఆక్రమించిన కట్టడాలను పరిశీలించి వాటిని తొలగించాలని తద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేయాలని అన్నారు. తదుపరి నగరంలో శ్రీ వెంకటేశ్వరా జనరల్ మార్కెట్ దగ్గర ఏర్పాటు చేస్తున్న రోడ్డుకు అవసరమైన స్థలాన్ని సేకరించాలని రోడ్డు కోసం స్థలం ఇస్తున్న వారికి టీడీఆర్, బాండ్లు విడుదల చేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్, సిటి ప్లానర్ వైవీబీ చంద్రబోస్, అసిస్టెంటు సిటీ ప్లానర్లు వరహాలుబాబు, అనితా జూలి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ లక్ష్మి జ్యోతి పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

యువకుడిపై పోలీసు వేధింపులు

కడియం: మండలంలో వడ్డే వెంకటప్రసాద్ అనే యువకుడిపై పోలీసులు వేధింపులకు పాల్పడ్డారని ఆ యువకుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఒక ప్రేమ వ్యవహారానికి సంబంధించి వెంకటప్రసాద్ తన మోటారు సైకిల్‌ను ఇచ్చి సహకరించాడని పోలీసులు చెబుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రసాద్‌ను స్టేషన్‌కు పిలిచి హింసించారని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రసాద్ తీవ్ర అనారోగ్యానికి గురై రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. దీనిపై దక్షిణ మండలం డీఎస్పీ కె.శ్రీనివాసులును వివరణ కోరగా కడియం పోలీసు సిబ్బంది నిబంధనల మేరకే వ్యవహరించారన్నారు. వెంకట ప్రసాద్‌ను హింసించారనడం సరికాదని వివరించారు.

ర్యాగింగ్ ఎంత పెద్ద నేరమో తెలుసుకోవాలి

- వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ శ్యామ్‌రాజ్‌నాయక్

రాజమహేంద్రవరం రూరల్: కళాశాలల్లో ర్యాగింగ్ చేయడం ఎంత పెద్ద నేరమో తెలిసేలా విద్యార్థులకు వారం రోజుల పాటు అవగాహన కల్పించామని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్‌రాజ్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కాతేరులోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాలలో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు వరకు నిర్వహించిన జాతీయ ర్యాగింగ్ నిరోధక ముగింపు వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. వారం రోజులుగా ర్యాగింగ్ వలన కలిగే దుష్పలితాలు వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఈ సందర్భంగా యూజీసీ (న్యూఢిల్లీ) తయారు చేసిన వీడియోలను విద్యార్థులకు ప్రదర్శించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు ర్యాగింగ్ నిరోధకత, ర్యాగింగ్ చట్టాలపై ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, పోలీసు అధికారులతో అవగాహన కల్పించామన్నారు. యాంటి ర్యాగింగ్‌పై ఆరు రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన పలు వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశామన్నారు. డాక్టర్ విజయశంకరబాబు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతి ప్రదానోత్సవంలో డీన్ శ్యామ్‌రాజ్‌నాయక్

21న గోదావరి గర్జన

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ


ప్రకాశం నగర్ : రాష్ట్రాన్ని రక్షించండి – దేశాన్ని కాపాడండి అనే నినాదంతో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నాయకత్వంలో చేపట్టిన బస్సుయాత్ర ఈ నెల 21న రాజమహేంద్రవరానికి చేరుకుంటుందని, కోటిపల్లి బస్టాండ్ వద్ద గోదావరి గర్జన నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశం వెలిగిపోతోందని మోదీ చెబుతున్నారని, వాస్తవానికి నిరుద్యోగం, ఆకలి పెరిగిపోతోందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ 21న సాయంత్రం బస్సుయాత్ర లాలాచెరువుకు చేరుకుంటుందన్నారు. అక్కడ నుంచి బైక్ ర్యాలీతో కోటిపల్లి బస్టాండ్‌కు చేరుకుంటుందని తెలిపారు. బస్సుయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా సహాయ కార్యదర్శులు కుండ్రపు రాంబాబు, రేఖ భాస్కరరావు, నగర కార్యదర్శి వి.కొండలరావు పాల్గొన్నారు.



బస్సుయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వనజ తదితరులు

ఉత్సాహంగా సేవా కార్యక్రమాలు

- మానవత రీజనల్ చైర్మన్ ప్రసాదరెడ్డి



పదవీ ప్రమాణ స్వీకారం చేసిన మానవత కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ: సేవా కార్యక్రమాలు నూతన పాలక మండలి మరింత ఉత్సాహంగా నిర్వహించాలని మానవత రీజనల్ చైర్మన్ చింతా ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సంస్థ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం, 2024–24 సంవత్సరానికి నూతన పాలకమండలి పదవీ ప్రమాణ స్వీకార మహోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రసాదరెడ్డి మాట్లాడుతూ సమాజంలో అవసరాలను అనుసరించి సంస్థ ద్వారా అంబులెన్స్, శాంతిరథం, ఫ్రీజర్ బాక్స్‌లు అందించే కార్యక్రమాలను ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్ సమాజ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని సేవాకార్యక్రమాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. సమాజంలో అనేకమంది మానవత సేవా సంస్థకు చేస్తున్న సహాయం మరువలేనిదన్నారు. సమాజంలో మానవత సేవాసంస్థ విద్య, వైద్యం వంటి బహుముఖ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. నూతన పాలకమండలి అధ్యక్షుడిగా బూరగడ్డ మురళి, సెక్రటరీగా కేవీవీగాంధీ సత్యనారాయణ, ట్రెజరర్‌గా పాలకృష్ణ ప్రసాదరెడ్డి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సంస్థ పూర్వ అధ్యక్షుడు మద్దుల మురళీకృష్ణ, కార్యదర్శి బీఎస్ఎన్ మూర్తి, ధన్వంతరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాసమూర్తి, స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకులు గుబ్బల రాంబాబు, వీజేఎస్ ఫార్మా కాలేజీ చైర్మన్ నల్లమిల్లి జగన్‌మోహన్‌రెడ్డి, రామిశెట్టి గంగాధర్, అప్పన్న రత్నాజీ, మెహర్ మధు, వ్యక్తిత్వ వికాస నిపుణులు దారపు నాగిరెడ్డి పాల్గొన్నారు

భక్తుల మన్ననలు పొందాలి



పాలకమండలితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంపీ భరత్‌రామ్

- ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): భగవంతునికి, ఆయన భక్తులకు సేవ చేసుకునే మహాభాగ్యం అందరికీ రాదని, పాలకవర్గం నిస్వార్థంగా పనిచేస్తూ భక్తుల మన్ననలు పొందాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ కోరారు. శుక్రవారం నగరంలోని ఆర్యాపురం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం నిర్వహించారు. శ్రావణ శుక్రవారం, సత్యనారాయణ స్వామి పుట్టిన రోజు (సత్య విదియ) కలిసి రావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. పాలకమండలి చైర్మన్‌గా దుంగా మంగాలక్ష్మి, సభ్యులుగా బిల్లపాటి శ్రీనివాస్, జగన్నాథం, రఘుపాత్రుని సాయిబాబు, బాసరబోయిన విజయ శంకర్, సాగర్ల దిలీప్ హర్ష, రేగుళ్ళ అన్నపూర్ణ, చొక్కాకుల వెంకట రమణి, సంసాని దుర్గ, పానంగిపల్లి వెంకటగోపాలరవిబాబు (అర్చకులు)తో ఎంపీ భరత్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గం చేసే అభివృద్ధి పనులతో ఆలయ కీర్తి ప్రతిష్టలు మరింత ఇనుమడింప జేయాలని, ఆలయ చరిత్రను వెబ్‌సైట్ లో పొందుపరచాలని సూచించారు. ఎంపీ భరత్, వైఎస్సార్ సీపీ అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరిలకు ఆలయ మర్యాదలతో, మేళతాళాలు, బాణసంచాతో స్వాగతం చెప్పారు. ఈఓ ఎస్. సత్యవాణి, రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పంతం కొండలరావు, గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీ ప్రియ, ఖాదీ బోర్డు వైస్ ప్రెసిడెంట్ పిల్లి నిర్మల, పాలిక శ్రీను, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, నగర బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, నగర యువజన విభాగ అధ్యక్షుడు పీతా రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే అజెండా



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో చందన నాగేశ్వర్, ఉప్పులూరి సత్యనారాయణ తదితరులు

- ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్, పార్టీ రూరల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్
- తొర్రేడులో టీడీపీ నుంచి 150 మంది వైఎస్సార్ సీపీలో చేరిక

రాజమహేంద్రవరం రూరల్: ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ అజెండాగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పరిపాలిస్తున్నారని ఆ పార్టీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. శుక్రవారం తొర్రేడు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పులూరి వీరవెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నుంచి 150మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి చందన నాగేశ్వర్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ నాలుగేళ్ల పాలనలో కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించారన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటిలోను సంతోషం వెల్లివిరుస్తోందన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారన్నారు. తొర్రేడు, వెంకటనగరం గ్రామాల్లో ఎవరికి ఏ అవసరం వచ్చినా ప్రజలకు సొంతనిధులతో సేవలు అందిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పులూరి సత్యనారాయణను చందన అభినందించారు. జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణు, తొర్రేడు సొసైటీ చైర్మన్ చిట్టూరి వెంకటరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి బొండియ్య, పార్టీ నాయకులు మెప్పిలిరాజు, ఉప్పులూరి రాము, సోడదాసి సుబ్బారావు, రెడ్డిచంటి, ఆచంట కళ్యాణ్, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా ఆశీర్వదించండి

- 49వ డివిజన్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డాక్టర్ గూడూరి

రాజమహేంద్రవరం సిటీ: సంక్షేమ రారాజు జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ సిటి కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగరంలో 49వ డివిజన్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ బర్రే కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరించే చర్యలు చేపడతానన్నారు. ఈ సందర్భంగా నూరానీ మసీదులో ప్రెసిడెంట్ ఖాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగనన్నను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. డివిజన్లో విద్యుత్తు స్తంభాల సమస్యలను పరిష్కరించాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రమాదంలో గాయపడిన యువకుడు షేక్ మహబూబ్ బాషా మంచానికి పరిమితమై ఉండడంతో అతనిని పరామర్శించిన ఆయన తక్షణం వీల్ చైర్ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ఏమాత్రం అధైర్యపడవద్దంటూ ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, ఎస్‌కే ఖాన్, గారా చంటిబాబు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



వృద్ధురాలి యోగక్షేమాలను అడిగి తెలుసుకొంటున్న డాక్టర్ శ్రీనివాస్

ఆ సవరణ చెల్లదు

సీటీఆర్‌ఐ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టానికి ఇటీవల చేసిన సవరణ చెల్లదని, ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు, భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయినాపురపు సూర్యనారాయణ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ సవరణ చట్టంపై హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.